


విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో హెల్పింగ్ హాండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వివిధ విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట రమణ, గౌరవ సలహాదారులు శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ప్రయోజకులు కావాలని పేర్కొన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటామన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్ సభ్యులు శీను, సుజిత్, భుపేష్, రాజేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

అక్రమ కూల్చివేతలు ఆపండి : సిపిఎం



అక్రమ కూల్చివేతలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఒక ప్రాంతం అభివృద్ధి జరుగుతోంది అంటే అక్కడి ప్రజలందరికీ సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయని, అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో రాయచోటి నుండి రాజంపేట రోడ్డు నిర్మాణం, మురుగు నీటి కాలువలు నిర్మాణ పనులు ఆ ప్రాంత వాసులను రోడ్డుపాలు చేసేందుకే జరుగుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు విమర్శించారు. శనివారం రాజంపేట రోడ్డు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని, అక్రమ కూల్చివేత ఆపాలని కోరుతూ ముద్రించిన ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. రాయచోటి పట్టణంలో రాణా సెంటర్ నుండి పాత మున్సిపల్ కార్యాలయం వరకు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారని సిపిఎం ఈ పనులను స్వాగతించిందని, రాయచోటి ప్రజలు సంబర పడ్డారని వివరించారు. నిర్మాణం జరుగుతున్న తీరు చూస్తుంటే అభివృద్ధి పెద్దలకు మాత్రమే సామాన్యులకు కాదని తేటతెల్లం అవుతోందని, "కాకులను కొట్టి గద్దలకు వేసే చందంగా" కాంట్రాక్టర్ల లాభాలకోసం సామాన్య ప్రజలను రోడ్డున పడవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు చేపట్టిన ద్వారకా కన్స్ట్రక్షన్ కంపెనీకి లాభాలు కోసం రాణా సెంటర్ నుండి సుండుపల్లి రోడ్డు లో ఉన్న ఇండ్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా, పునరావాసం చూపకుండా అధికారులు, అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా ప్రజల ఇండ్లను కూలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందచేసి, పునరావాసం కల్పించిన తర్వాత ఇండ్లు పడగొట్టాల్సిన అవసరం ఉన్నదని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం ఊసే లేకుండా ఎవరి ఇండ్లను వాళ్లే పడగొట్టుకునే విధంగా భయభ్రాంతులకు గురిచేసి అధికార పార్టీ నేతలు శునకానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. రోడ్డు వెడల్పుతో పాటు ఇరువైపులా నిర్మిస్తున్న మురుగునీటి కాలువల నిర్మాణం అలీమాబాద్ ప్రాంతం నుండి వచ్చే డ్రైనేజీ నీరు మండిల వద్ద గల కాలువకు, రవి హాల్ వద్ద నుండి వచ్చే మురుగు నీటిని కూడా మండీల వద్ద ఉన్న తూములకు కలుపుతూ జరుగుతుందని దీనివల్ల పట్టణంలోని మొత్తం డ్రైనేజీ నీరు మరియు వర్షపు నీరు ఒకే కాలువకు చేరి, లోతట్టు ప్రాంతమైన కొత్తపల్లి ప్రాంతంలోని ఇండ్లల్లోకి నీరు మునిగి పోతుందని వివరించారు. అయితే రవి హాల్ నుండి వచ్చే డ్రైనేజ్ కాలువను రాణా వద్ద గల డ్రైనేజ్ కాలువకు కలపడం ద్వారా కొత్తపల్లి ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయవచ్చని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో రాచరిక పద్ధతులు అవలంభిస్తున్న అధికార పార్టీ నేతలు కల్లు తాగిన కోతిలాగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజలపై దాడులకు తెగబడుతున్నారని, దౌర్జన్యంగా ఇండ్లు కూలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలఓట్లతో గద్దెనెక్కిన వైసీపి పార్టీ ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేస్తూ, అధికార మద బలంతో సామాన్య ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. నిర్వాసితులకు అండగా సిపిఎం ఇప్పటికే అనేక ఉద్యమాలు పోరాటాలు చేస్తున్నది. అదేవిధంగా రాజంపేట రాయచోటి రోడ్డు విస్తరణలో నిర్వాసితులవుతున్న ప్రజలకు సిపిఎం అండగా నిలుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాన్ని, స్థానిక శాసనసభ్యుల తీరును ఎండగడుతూ ప్రజల్లోకి వస్తోందని వివరించారు. రాజంపేట రోడ్డులో నిర్వాసితులవుతున్న ప్రజలకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని, చట్ట ఉల్లంఘనకు పాల్పడి దౌర్జన్యంగా ఇల్లు కూలగొడుతున్న ద్వారకా కన్స్ట్రక్షన్ కంపెనీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పునరావాసం కల్పించి, నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షంలో బాధితులను కూడగట్టి, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సహకారంతో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డిసి.వెంకటయ్య పాల్గొన్నారు.

ఎసిబి వలలో సుండుపల్లె తహశీల్దార్

ప్రజాశక్తి-సుండుపల్లె

అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె తహశీల్దార్ కార్యాలయంపై ఎసిబి అధికారులు శనివారం వల విసిరారు. భూమిని ఆన్‌లైన్ చేసేందుకు రైతు నుంచి లంచం తీసుకుంటున్న తహశీల్దార్ జి.రవి, ఆర్ఐ ఎం.కిరణ్‌లను పక్కా వ్యూహంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదుతో సహా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయంపై ఎసిబి అధికారుల దాడి అధికార వర్గాల్లో కలకలం సృష్టించింది. దాడి విషయం తెలిసిన వెంటనే స్థానికంగా ఉన్న వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కార్యాలయాల నుంచి మాయమయ్యారు. ఫోన్లు సైతం స్విచ్‌ఆఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయారు. ఈ సందర్భంగా ఎసిబి అడిషనల్ ఎస్‌పి దేవప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బాగంపల్లి ఎరమనేని పాలెం గ్రామ పంచాయతీ కుంట్లముందరకు చెందినకి చెందిన రైతు ప్రభంజన్‌రెడ్డి తన భూమి 1.40 ఎకరాలను ఆన్‌లైన్ చేసేందుకు తహశీల్దార్ రవి, ఆర్ఐ కిరణ్ రూ.40 వేలు అడిగారని తెలిపారు. రైతు స్పందనలో ఫిర్యాదు చేయడంతో ఆ ఫిర్యాదు మేరకు పట్టుకున్నట్టు చెప్పారు. తొలుత ఆన్‌లైన్ చేసేందుకు రూ.లక్ష అడిగారని చెప్పారు. రూ.40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. రైతు నుంచి తహశీల్దార్ నగదు తీసుకుంటున్న సందర్భంగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని పేర్కొన్నారు. వారివురిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



నగదుతో ఎసిబికి చిక్కిన తహశీల్దార్, ఆర్ఐ

ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రాధాన్యత భవనాల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. శనివారం వివిధ ప్రభుత్వ పథకాల అమలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత భవనాలు పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హౌసింగ్ కార్యక్రమం కింద స్టేజ్ కన్వర్షన్‌పై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. నా నెల-నా దేశం ("మేరి మిట్టి, మేరా దేశ్") ప్రచారం మన సాంస్కృతిక మూలాలను, జాతీయ గుర్తింపును కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పే విధంగా జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులతో కూడిన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హౌసింగ్ లే అవుట్ లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం, రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులకు, టవర్లకు భూ సేకరణ, పీఆర్ ఆర్డీ కింద ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ, స్వామిత్ర, జాతీయ చేనేత దినోత్సవం, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, డైరీ డెవలప్మెంట్, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, ఆడుదాం ఆంధ్ర, వైయస్సార్ అచీవ్మెంట్ అవార్డులు, తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గిరీష, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, హౌసింగ్ పీడీ శివయ్య, జిల్లా అగ్రికల్చర్ అధికారి చంద్రనాయక్, డిపిఒ ధనలక్ష్మి, ఎస్ డబ్ల్యూఎస్ ఎఇ మనోహర్ రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

ఆడబిడ్డకు చదువుంటేనే ఉజ్వల భవిష్యత్తు

- న్యాయమూర్తి ఎం.శ్రీనివాసులు నాయక్

ప్రజాశక్తి-పీలేరు

సమాజంలో ఆడబిడ్డకు చదువుంటేనే వారికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని పీలేరు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పీలేరు-చిత్తూరు మార్గంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజం చూసి గర్వించేలా ఆడబిడ్డలు ఓ మంచి లక్ష్యంతో చదువుకుని రాణించాలన్నారు. ఎఫ్ఐఆర్, ఫోక్సో చట్టం, సీనియర్ సిటిజన్ల చట్టం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం, హిందూ వివాహ చట్టం, ఆస్తి హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, ఉచిత న్యాయ సేవలు, మొదలగు చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. న్యాయ విజ్ఞాన సదస్సు ద్వారా తెలుసుకున్న విషయాలను విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులతో పాటు పరిసరాల్లోని వారికి కూడా వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకుల విద్యా లయ ప్రిన్సిపాల్ బేబీ కరుణ, బోధనా సిబ్బంది మాధవి, జయశ్రీ, రమణి, నిరంజని, శారద, ఉషశ్రీ, షిరీన్, అనురాధ, ముక్తియార్ బేగం, భువనేశ్వరి, తస్లీమా, శివలక్ష్మి, అపర్ణ, కోర్టు సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యేలు

చంద్రబాబుపై క్రిమినల్ కేసు పెట్టాలి

- విలేకరుల సమావేశంలో వైసిపి ఎమ్మెల్యేల డిమాండ్

ప్రజాశక్తి-కురబలకోట

అల్లర్లకు కారణమైన ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడుపై క్రిమినల్ కేసులు పెట్టాలని వైసిపి ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, నవాజ్‌బాషా అన్నారు. శనివారం తంబల్లపల్లె నియోజకవర్గంలోని అంగళ్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చేస్తున్న రౌడీయిజం భవిషత్తులో ఏ రకమైన సంకేతానికి దారితీస్తుందో అర్థం కావడం లేదన్నారు. రోజు రోజుకూ ప్రజాభిమానం కోల్పోతూ, క్యాడర్‌ను పోగొట్టుకుంటుండడంతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. చంద్రబాబు 10 రోజుల ప్రాజెక్టుల సందర్శన పేరుతో చేపట్టిన యాత్ర అల్లర్లకు దారితీసిందన్నారు. ప్రాజెక్టులపై చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పై అధికార పార్టీ ప్రతి అంశంపై వివరణ ఇచ్చామన్నారు. ప్రాజెక్టులకు ఎవరు రూప కల్పన చేశారు, వాటిని ఎవరు పూర్తి చేశారని వాటి వివరాలు తెలపాలని అడుగుతుంటే వాటిపై సమాధానాలు చెప్పడం లేదన్నారు.పోతిరెడ్డిపాడు వద్దన్న వ్యక్తికి రాయలసీమ ప్రాజెక్టులు గురించి మాట్లాడే ఏరకమైన అర్హత ఉందా అని ప్రశించారు. ఈ ప్రాంతానికి వరప్రసాదిని అయిన హంద్రీ నీవా ని ఫేస్ 1 నే జీడిపల్లెకు 4 టిఎంసిలు ఉన్న ప్రాజెక్ట్‌ను వద్దు ఇది పనికిరాదని ఇది కేవలం చిన్నప్రాజెక్టుగా చేద్దామని 5 టిఎంసిలు చేద్దామని చెప్పి కుదించిన వ్యక్తి చంద్రబాబు అని దానిపై ప్రశ్నిస్తే వాటిపై సమాధానాలు చెప్పక వింతగా ప్రవర్తిస్తున్నారన్నారు. అంగళ్లు, పుంగనూరులలో ప్రవర్తించిన తీరు సభ్య సమాజం సిగ్గు పడేలా ఉందన్నారు. నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చి కొట్టండ్రా, తరమండ్రా అనే వ్యాఖ్యలు చేయడం తన ప్రవర్తన స్పష్టంగా కన్పించిందన్నారు. పులివెందులలో పులికేక వేశామని, సింహంలా గర్జించామని చెప్పుకుంటున్నారన్నారు. నీవు సింహం, పులివో, నక్కవో లేక పిల్లి ఓ తమకు తెలియదని, చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ప్రజాభిమానం ఉందన్న నమ్మకం ఉంటే 175 స్థానాలలో ఒంటరిగా పోటీ చేస్తామని చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ప్రాజెక్టులపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కుప్పంకు నీళ్ల ఇవ్వని చరిత్ర మీదన్నారు. ప్రాజెక్టుల డిజైన్‌కు చేయాలన్న ఆలోచనలు మీకు లేవు, చేయాలన్న తపన టిడిపి కి లేదన్నారు. పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రి ఉన్న నీవు శాస్వితంగా చెప్పుకునే అభివృద్ధి ఏదీ లేదన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయండి

రాయచోటి టౌన్ : విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ ఆశ వర్కర్ల సేవలను నిర్వర్తించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఖాళీలుగా ఉన్న ఆశ వర్కర్ల పోస్టులకు ఎంపికైన 10 మంది అభ్యర్థులుకు శనివారం తన కార్యాలయంలో ఉద్యోగ నియామక పత్రాలను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, వైద్యాధికారులుతో కలసి ఆయన అందచేశారు. రామాపురం-2, రాయచోటి టౌన్ వాల్మీకి స్ట్రీట్-1, యండపల్లె-3,సంబేపల్లె-1, గాలివీడు-1, దేవలంపల్లె-1, కోనంపేట-1 పిహెచ్‌సిల పరిధిలో ఆశా వర్కర్ల పోస్టులకు నియామక పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులుతో బాధపడుతున్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి ఆసుపత్రులకు పంపించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో కష్టపడేవారిని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయన్న ఉద్దేశ్యంతో సిఎం జగన్ ఆశ వర్కర్లకు వేతనాలను రూ.3 వేల నుంచి రూ.10 వేలుకు పెంచారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్, ఎన్‌జిఒ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

చంద్రబాబుపై పోలీసుస్టేషన్‌లో వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు బి.కొత్తకోట పోలీసుస్టేషన్‌లో చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీస్ నిబంధనలు ఉల్లంఘించి ఓ మాజీ ముఖ్యమంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రశాంతమైన నియోజకవర్గంలో అలజడులు సృష్టించడానికి ప్రయత్నించిన మాజీ ముఖ్యమంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, ఎంపిటిసి రామ సుబ్బారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్ రెడ్డి,వైసిపి నాయకులు భీమగాని ప్రభాకర్ రెడ్డి,సిఆర్ చిన్నికృష్ణ ,జీవి రామకృష్ణ, గుమ్మడికాయల చాంద్ భాషా, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాం రెడ్డి, అంజమ్మ, జిల్లా వైసిపి ప్రచార కార్యదర్శి అయుబ్ బాషా, వైసిపి నాయకులు ప్రదీప్, విద్యార్థి విభాగం రమేష్ రెడ్డి, సద్దాం, సల్మాన్, సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాడు-నేడు పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మదనపల్లె తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలోని నాడు-నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల బదిలీపై ఎంఇఒ-2లుగా వచ్చిన వారు, ప్రధానోపాధ్యాయుల సంఘ బాధ్యులు జిల్లా విద్యాశాఖ అధికారికు సత్కరించారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి కృష్ణప్ప, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ పురుషోత్తం

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అనారోగ్యాపాలై ఆర్థిక ఇబ్బందులు పడ్డవారికి ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో 10 మంది లబ్ధిదారులకు రూ.24.65 లక్షలు మంజూరైంది. లబ్ధిదారులకు చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య అవసరాల కోసం అప్పులు చేసి వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిది ఆపన్న హస్తంగా ఉపయోగపడుతోందన్నారు. సిఎం వైఎస్ జగన్, శ్రీకాంత్‌రెడ్డిలకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఉపేంద్రారెడ్డి, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్ సాదిక్ అలీ, సర్పంచ్‌లు వెంకట రమణ నాయక్, నాగభూషన్‌రెడ్డి, నాయకులు మానవతా ఎర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

'నాభూమి నాదేశం'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

జాతీయ స్థాయిలో జరగబోయే నాభూమి నాదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్‌డిఒలు, తహశీల్దార్ల, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులతో విసి ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా భూమి నా దేశం అనే కార్యక్రమంలో ఆరు అంశాలు ఉంటాయని తెలియజేశారు. ఈ ఆరు అంశాలు వరుసగా శిలాఫలకాలను ఏర్పాటు చేయడం, ప్రతిజ్ఞ చేయడం, మొక్కలు నాటడం వీరులకు వందనం, జాతీయ జెండాను ఎగరవేయడం, మట్టిని సేకరించడం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధుల సమక్షంలో వాలంటీర్ల సేవలను వినియోగించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనబోయే ప్రతి ఒక్కరు శిలాఫలకం దగ్గర లేదా నాటిన మొక్కల దగ్గర సెల్ఫీ తీసుకోవాలని పేర్కొన్నారు.సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికా రులు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చంద్రబాబుపై దాడి సిగ్గుచేటు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజకీయంగా చంద్రబాబును ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక దాడి చేయడం సిగ్గుచేటని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయులు అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది అసలు రాష్ట్రమా రావణకాష్టమా అని తీవ్రంగా మండిపడ్డారు. పుంగనూరులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాళ్లదాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులపై యుద్ధభేరి ప్రకటించి టిడిపి హయాంలో మంజూరు చేసిన సాగు, తాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేసి వైసిపి పాలన ఇప్పటికి దాదాపు నాలుగున్నరేళ్లు పూర్తి కావస్తున్నా ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయకుండా పెద్దిరెడ్డి కమీషన్లు దండుకొని రాయలసీమతో పాటు రాష్ట్రాన్ని సర్వనాశం చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు పై రాళ్లదాడి చేయించిన పెద్దిరెడ్డికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జిల్లాకు ఒక సైకో మంత్రిని తయారు చేశారని, వీరికి అభివృద్ధి అంటే ఏంటో తెలియదని కేవలం ప్రశ్నించిన వారిపై దాడులు చేయించడమే వీరి పనిగా పెట్టుకున్నారని అన్నారు. నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో అభివృద్ధి నిల్-అరాచకాలు ఫుల్ అని మండిపడ్డారు. చంద్రబాబు 14 ఏళ్ళ ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఏనాడు ఇలా ఆలోచన చేయలేదన్నారు. ఒకవేళ ఇలా ఆలోచించి ఉంటె వైసిపి నాయకులు ఇక్కడ ఉండేవారా? అని ప్రశ్నించారు. పుంగనూరు సంఘటనపై రాష్ట్ర గవర్నర్‌ను కలిసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సుధాకర్, మండల అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, మనీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయులు

అనుచితం

ప్రజాదృష్టి

భిన్నాభిప్రాయాలు, నిరసనలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులు. ఇటువంటి ఉత్తమ విలువలకు భిన్నంగా ఇటీవల రాష్ట్రంలోని పులివెందుల, పుంగనూరు నియోజకవర్గ కేంద్రాల్లో అధికార పార్టీ వ్యవహరించడం ఆందోళకరం. పాలక పార్టీలు ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ వైఖరుల్ని బలప్రయోగం ద్వారా అడ్డుకోవాలని చూడడం విస్మయకరం. దేశంలో, రాష్ట్రంలోనూ పాలక పార్టీలు అధికా రాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకత్వాలపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడడం ప్రజాస్వామ్య విలువల్ని పాతాళానికి తొక్కేయడమేనని చెప్పవచ్చు. దేశంలోని రాజకీయ పార్టీలు ఏదైనా ఒక అంశంపై భిన్నాభిప్రాయాల్ని వెల్లడించొచ్చు. ఇటువంటి విలక్షణ వ్యవస్థలో పాలకపక్షాలు ఆయా ప్రతిపక్ష పార్టీలు తమ ఆలోచనలకు అనుగుణంగా స్పందించడం లేదనే ఉద్దేశంతో అసహనానికి గురికావడం తగదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీల భిన్నాప్రాయాల్ని, నిరసనల్ని సహించలేక పోవడం నియంతృత్వానికి సంకేతం. ఇటువంటి సంకేతాలు ప్రజా స్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటివని గుర్తించాల్సి ఉంది. అధికారంలో ఉన్న పాలక నాయకత్వం, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు చేసే విమర్శల్ని హుందాగా స్వీకరించాలి. అందులోని వాస్తవాలను అర్థం చేసుకుని తప్పులు దొర్లి ఉంటే సరిదిద్దుకో వడా నికి భిన్నాభిప్రాయాలు, నిరసనలు ఉపయోగపడతాయని గ్రహి ంచా లి. ప్రస్తుత పాలక పార్టీ భవిష్యత్‌లో ప్రతిపక్ష పార్టీగా మారే అవకాశాలు ఉన్నాయి. బండ్లు, ఓడలు, ఓడలు బళ్లు అవుతాయన్న సామె తను మరిచి చిత్తానికి తోచినట్లు ఇష్టానుసారంగా ప్రవర్తించడం తగదు. అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్షాల విమర్శల్ని సహించ లేక పోవడం, ప్రతిపక్ష పార్టీ నాయకత్వాలపై రాళ్లదాడులు, దౌర్జన్యా లకు పాల్పడడం విలువల పతనానికి సంకేతం. ఇటువంటి సహించలేని పాలక పార్టీలు కాలగమనంలో కలిసిపోతాయని గమనించాల్సి ఉంది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే సత్యాన్ని గుర్తించి, అధి కార, ప్రతిపక్ష పార్టీలు తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించాల్సి ఉంటుంది.పాలక, ప్రతిపక్ష పార్టీలు దిగజారిన పదజాలాన్ని ప్రయో గించడం అభ్యంతరకరం. సమాజం ఉత్తమ, మధ్యమ, అథమ శ్రేణులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో ఉత్తమ కేటగిరిలోని మేధావులు, ఉత్తములు దిగజారిన పదజాల ప్రయోగాల్ని అసహ్యించుకుం టున్నారనే స్పృహ లేకుండా మాట్లాడడం విస్మయాన్ని కలిగిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల దగ్గర నుంచి దేశంలోని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రొఫెషనలిస్టుల ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీల నిర్వహణ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించ డానికి ఎన్నికల ప్రొఫెషనషలిస్టుల సహకారంతో వెళ్తున్నట్లుగా ప్రజా స్వామ్య విలువల్ని ఒంట బట్టించుకోవడానికి సైక్రియాటిక్, ఫిలాం త్రోఫిక్ ప్రొఫెషలిస్టులను నియమించుకోవాల్సిన పరిస్థితులు దగ్గర లోనే ఉన్నాయనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఇప్పటికైనా దేశం లోని రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రాధా న్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపల్

ఇంటర్న్‌షిప్‌లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్న పి.పవిత్ర, కె. సాజిద ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, కాంచీపురంలో ఆరు వారాల ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. కంప్యూటర్ సైన్స్‌లో రీసెర్చ్ ఇంటర్న్‌షిప్(ఐఆర్ఎస్)లో భాగంగా మెషిన్ లెర్నింగ్ యూసింగ్ పైథాన్‌పై విద్యార్థులకు ఈ ఇంటర్న్‌షిప్ లభించినట్లు తెలిపారు. విద్యార్థులు కోవిడ్ పేస్ మాస్క్ డిటెక్షన్ యూసింగ్ సిఎన్ఎన్ అల్గోరిథంపై పరిశోధనలు చేసినట్లు చెప్పారు. అక్కడ పనిచేస్తున్న ప్రొఫెసర్ కాళ్ల జగదీశ్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్న్‌షిప్ చేసినట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందించారన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్ అభినందనలు తెలిపారు.

సుప్రీం కోర్టు తీర్పు బిజెపికి చెంపపెట్టు

పుల్లంపేట : గుజరాత్ బిజెపి ఎమ్మెల్యే రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ పరువు నష్టం కేసులో సూరత్ జిల్లా కోర్టు విధించిన రెండు సంవత్సరాల జైలు శిక్ష పై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేస్తోందని, ఇది ఒక చారిత్రక తీర్పని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి గోసాల దేవి పేర్కొన్నారు. బిజెపి అన్ని వ్యవస్థను నాశనం చేస్తూ ప్రతిపక్ష నేతల మీద అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించి వేధించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.


పుట్టిన రోజు వేడుకల్లో జనసేన నాయకులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట జనసేన పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకట రమణ పుట్టినరోజు వేడుకలు శనివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పాత బస్టాండు కూడలిలో భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి సుమారు 1500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేనాని ఆశయ సాధన కోసం పరితపిస్తూ నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తున్న మలిశెట్టిని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన వీరమహిళ అధ్యక్షులు సుబ్బరాయుడు, అన్నమయ్య భాస్కర్ పంతులు, పోలిశెట్టి వెంకటరమణ, పోలిశెట్టి రజిత, గోపాల్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి-పుల్లంపేట

స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో రైతుభరోసా సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ పంటకోత ప్రయోగానికి ఎంపికయ్యాయని అన్నారు. రామ సముద్రం, దేవసముద్రం గ్రామాలు ఎన్నికయ్యాయని అన్నారు. పంటకోత ప్రయోగాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పొలం ఎంపిక, సర్వేనెంబర్ ఎంపిక, పంట కోత ప్రయోగం ఆయుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువలు గురించి రైతు భరోసా కేంద్ర సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గణాంక అధికారి నాగలక్ష్మమ్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య రైతు భరోసా సిబ్బంది, జెడిబిఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ, బాస్ నాయకులు

వీరవందన సభకు తరలిరండి

- బాస్ నాయకుల పిలుపు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అనంతపురంలోని అంబేద్కర్ భవనంలో పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న వీరవందన సభకు భారీగా తరలిరావాలని బాస్ బి.కొత్తకోట మండల అధ్యక్షులు పఠాన్ వెంకటేష్, జిల్లా కార్యదర్శి సింగన్న, అన్నమయ్య జిల్లా కార్యదర్శి సదిన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బాస్ కార్యాలయంలో బాస్ , విసికె పార్టీ కుటుంబ సభ్యులు, అంబేద్కర్ వాదులు, సిపిఐ, సిపిఎం సభ్యులతో కలిసి వీరవందనసభ కరపత్రాలని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఎంపీ తిరు మావళ్లవన్ ... సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ, హరిబాబు, బిఎస్‌పి రాష్ట్రఅధ్యక్షులు, ఎస్ఐపి.విద్యాసాగర్, వీసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బాల సింహం, తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జిలు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి బాస్, విసికె నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు సిపిఐ భాషా, రామప్ప, మణి, టౌన్ కమిటీ అధ్యక్షులు, కె.వెంకటేష్, బాబు అహ్మద్, కె.శ్రీనివాసులు, చెన్నకేశవులు, ఎం.నరేష్,రామన్న, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విధులను బాధ్యతగా నిర్వర్తించండి

రామాపురం : ఆశ కార్యకర్తలు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ విధులను నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలో శనివారం కొత్తగా విధి నిర్వహణలో చేరిన ఆశ కార్యకర్తలకు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో స్థానిక పిహెచ్‌సి పరిధిలో పనిచేసే ఆశ కార్యకర్తలు రావడం సంతోషకరమన్నారు. **నందలూరు :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాటూరు గ్రామ పంచాయితీ, గోకోంకర్ కాలనీ నివాసి శ్యామల ఇటీవల ఆశ కార్యకర్తగా ఎంపికయ్యారు. స్థానిక పిహెచ్ సిలో నియామక ఉత్తర్వులను ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన లో నందలూరు మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎమ్. సృజన అందించారు.

NAME CHANGE

I, Kumpati Sivakumar Reddy, F/O Kumpati Palvi, hereby announce that I have changed my daughter's name from 'Kumpati Palvi' (old name) to 'Kumpati Pallavi' (new name). This name change is for all future purposes, including passport and other official documents.

నులిపురుగుల మందులు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని స్థానిక మండల అభివృద్ధి అధికారి సభ భవనం శనివారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా స్థానిక డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మనోజ్‌చంద్ర, ఎంఇఒ నాగతిరుమలరావు ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులకు నులిపురుగుల దినోత్సవం గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ కోవిడ్ 19 భద్రత మార్గదర్శకాలను అనుసరించి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు , అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు నులిపురుగుల మందులు 1 నుంచి 19 సంవత్సరంల వరకు వయస్సు గల పిల్లలందరికీ కిశోరబాలికలకు వేయాలని తెలిపారు. ఒకటి నుండి రెండు సంవత్సరముల వయసు గల పిల్లలకు సగం టాబ్లెట్ , మూడు నుంచి 19 సంవత్సరాలు గల పిల్లలకు కూడా ఒక టాబ్లెట్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రఘురాం,ఎంఇఒలు నాగ తిరుమలరావు, చక్రధర్ రాజు, ఎపిమోడల్ స్కూల్ ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎం లు, అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజా, శివ గౌరీ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


ఎంఇఒలకు నులిపురుగు మందులను అందిస్తున్న డాక్టర్ సానే శేఖర్

మినీ థియేటర్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన మినీ థియేటర్‌ను శనివారం రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా థియేటర్ యజమాని నూర్‌అహ్మద్ మాట్లాడుతూ ఆర్‌టిసి శాఖ నుంచి పది సంవత్సరాలకు బస్టాండ్ స్థలాన్ని లీజుకు తీసుకోవడం జరిగిందని తెలిపారు. మినీ థియేటర్, మినీ హోటల్‌ను ప్రారంభించడానికి అనుమతుల కోసం ఆర్‌డిఒ, రెవిన్యూ, పోలీసు, వైద్య, విద్యుత్తు, ఆర్‌అండ్‌బి, ఎంపిడిఒ శాఖలకు ఎన్‌ఒసి కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎంపిడిఒ శాఖ నుంచి మాత్రం వచ్చిందని, మిగిలిన శాఖ అధికారులు జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో అందజేస్తామని ఇప్పటికీ అందిం చకపోవడంతో ఎనిమిది నెలలుగా థియేటర్‌ఋ ప్రారంభించుకోలేక ఇబ్బందులు పడుతున్నానని ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. నష్టం జరగకుండా అధికారులు పరిశీలించి ఎన్‌ఒసి ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులకు ఆర్‌డిఒ సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి మేడ విజయభాస్కర్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లాఖాన్, మండల ఉపాధ్యక్షులు అనుదీప్, తుమ్మల శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.


మినీ థియేటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి

నాసా ఫలితాల్లో ప్రతిభ చాటిన శ్రీచైతన్య విద్యార్థులు


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ కేంద్రంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్నటువంటి శ్రీ చైతన్య విద్యార్థులు అమెరికా నాసా ఎన్‌ఎస్‌ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్-2023లో శ్రీ చైతన్య వరుసగా వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచిందని విద్యార్థులకు జరిగిన పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు తిరుగులేని విజయాలను సాధించి పథకాలను సాధించారని ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం శ్రీచైతన్య పాఠశాలలో వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో పోటీ పరీక్షలలోనూ, సాంకేతిక రంగంలోనూ ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పథకాలు సాధించిన జతిన్‌కృష్ణ, నిహార్, అబ్దుల్ అజీజ్, సాయి సుజిత్ లకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కుటుంబరావు, వైస్‌ప్రిన్సిపల్ అనూష, అకడ మిక్ డీన్ వెంకటసుబ్బయ్య, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, నాసా ఇన్‌ఛార్జి శ్వేత వెంకటసుబ్బయ్య , ప్రైమరీ ఇన్‌ఛార్జి కస్తూరి పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ డేవిడ్ సుకుమార్

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిని అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్‌రే పటము నమూనాలను, కాన్పుల గదులను, ఒపి, మందుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఏడు కోట్ల రూపాయలతో నూతన భవనాలు ఏర్పాటు చేశారని ఆస్పత్రిలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రసూతి సంఖ్యను పెంచాలన్నారు. డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని సూచించారు. కొత్తగదులు ఏవైనా అవసర ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఇది వరకు ఆస్పత్రిలో పనిచేసి పదోన్నతిపై డిసిహెచ్‌ఎస్ జిల్లా ఆఫీసర్ గా వెళ్లిన సందర్భంగా డాక్టర్ డేవిడ్ సుకుమార్‌కు కమిటీ సభ్యులు, ఎంపిడిఒ వెంకటరామిరెడ్డిలు సన్మానం చేశారు. కార్య క్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగం, డాక్టర్లు ధరణి, భరత్, సిబ్బంది పాల్గొన్నారు


ఎముకల పటిష్ట పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉచితంగా ఎముకల పటిష్ట పరీక్షలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అంవపల్లె గ్రామం ఆర్‌ఎస్ రోడ్డు నందు వున్న దీప్తి క్లినిక్‌లో ఎముకల పటిష్టత పరీక్షలను ఉచితంగా నిర్వహిం చినట్లు రైల్వే మెడికల్ సీనియర్ ఆఫీసర్ డాక్టర్ బచ్చు జయభాస్కర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎన్‌సిఆర్ హెల్త్ కేర్ సహకారంతో ఎంఎల్‌టి అభిషేక్ యాదవ్ ఎముకల ధృడత్వ పరీక్షలు నిర్వహించారు. ఇందుకోసం దాదాపు రూ.2వేలు ఖర్చు అవుతుందని, దీనిని పూర్తిగా ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 190 మందికి పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సుజాత, మ్యాన్ కైండ్ మెడికల్ రిప్రజెంటేటివ్ రామచంద్ర, సందీప్ రోగులు, ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై కేసు నమోదు

ములకలచెరువు: నియోజకవర్గంలోని ములకలచెరువు, కురబలకోట మండలాలకు చెందిన ఆరుగురు టిడిపి నాయకులపై కేసు నమోదు చేసినట్లు ములకలచెరువు ఎస్ఐ గాయిత్రి తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. రాయలసీమ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ములకలచెరువు మీదుగా అంగళ్లకు వెళ్లారు. చంద్రబాబు ములకలచెరువు దాటిన తరువాత పలువురు టిడిపి నాయకులు రహదారిపై ఉండి ప్రజలకు, వాహనదారులకు అంతరాయం కలిగించి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల ములకలచెరువు ఎంపిటిసి భర్త చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు టిడిపి మండల కన్వీనర్ పాలగిరి సిద్ధా, మాజీ జడ్‌పిటిసి సభ్యుడు శంకర్, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి సురేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కెవి రమణ, నాయకులు నాగరాజుయాదవ్, శ్రీనాథెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో దంత వైద్య సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో దంత వైద్యసేవలు కొరకు డెంటల్ ఈక్విప్‌మెంట్స్, మిషనరీ, పరికరాలు అమర్చటం జరిగిందని దంత వైద్యని పుణులు దుర్గాదేవి పేర్కొన్నారు. సోమ వారం నుంచి వైద్యసేవలు ప్రారంభ మవుతాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు ఆరిఫ్ తెలిపారు. ఆస్పత్రి దినదినాభివృద్ధిలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారాకనాథ్‌రెడ్డి కృషి అభినందనీయమని అభివృద్ధి కమిటీ సభ్యులు నక్కా మహేష్‌కుమార్, కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.


ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన దంత వైద్య పరికరాలు

సిఐ సాధిక్‌అలీ బదిలీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు సిఐ సాధిక్ అలీ రాయచోటి టాస్క్ ఫోర్స్‌కి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మొలకలచెరువు సిఐగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టేవారు. నేరాలు అదుపుకు పూర్తి బాధ్యతలు చేపట్టారు. సీఐ సాదిక్ అలీ రాయచోటికి బదిలీ కాగా ఆయన స్థానంలో మదనపల్లి రూరల్‌సర్కిల్ సిఐ శివాంజనేయులు మొలకలచెరువు ఇన్‌ఛార్జి సిఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.

కాలువలకు మరమ్మతులు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక వెలిగల్లు రిజర్వాయర్ కింద ఉన్న కుడి కాలువ మరమ్మతులను ప్రారంభించినట్లు డిఇ.శిరీష్ కుమార్ పేర్కొన్నారు. గరుగుపల్లి పంచా యతీలో వంతెన పనులు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. అక్కడక్కడ దెబ్బతిన్న కాలువలను యంత్రాలను ఉపయోగించి వాటిని సరి చేస్తు న్నామని చెప్పారు. కుడి కాలువ 25 కిలోమీటర్ల వరకు కాలువ పనులు చేపట్టామన్నారు. కాలువలో నిండిన జమ్మునుగడ్డిని, కొండలు గుట్టలలో వర్షాలకు దిగిపడ్డ మట్టిని కూడా తొలగింప జేసినట్లు చెప్పారు.

వైసిపికి ఓటమి భయం పట్టుకుంది

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాబోవు ఎన్నికల్లో వైసిపికి ఓటమి భయంతోనే టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకుంటున్నారని టిడిపి రాష్ట్ర బిసి అధికార ప్రతినిధి వల్లిగట్ల వెంకట్రమణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నారా చంద్రబాబు శుక్రవారం మదనపల్లె డివిజన్‌లోని సాగు, తాగు నీటి ప్రాజెక్టులను సందర్శించి, ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధిపై వైసిపి ప్రభుత్వ అలసత్వాన్ని, అసమర్ధతను ప్రశ్నిస్తుంటే, వైసిపి ప్రభుత్వం సమాధానం చెప్పాల్సింది పోయి జెడ్ క్యాటగిరి ఉన్న మాజీ ముఖ్యమంత్రిపై రాళ్లు విసరడం, భయాందోళనలకు గురి చేయడం సమంజసం కాదన్నారు. కేవలం వైసిపి ఓటమి భయంతోనే ఇలాంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మండి పడ్డారు. వైసిపి నాయకులవి వికృత చేష్టలని, ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారని ఆరోపించారు. రాబోవు ఎన్నికల్లో వీరికి ప్రజలే బుద్ధి చెబు తారని, ఇలాంటి దాడులకు మరో సారి వైసిపి నాయకులు పాల్పడితే తాము సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎస్‌సి సెల్ అధ్యక్షులు గాంధీపేట రమణ, నాయకులు పివి నారాయణ, కోసూరి రమేష్, కోసూరి చంద్రమౌళి, ఆదినారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు


అరవపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-నందలూరు

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి గంధంగంగాధర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అరవపల్లిలో మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం ఆడబిడ్డనిధి, తల్లికి వందనం, దీపంపథకం, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత పథకం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు, పూర్‌టురిచ్ పథకం ద్వారా ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు చేసేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగుల కోసం 20 లక్షల ఉద్యోగాలతో పాటు, యువ గలం నిధి ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిసి సెల్ ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు, నారపుశెట్టి శివ, జ్యోతి, శివ, మోడపోతుల రాము, పెంచలయ్య, తుంటి సుబ్బరాయుడు, పాటూరు రమేష్, గౌస్ బేగ్ పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

మండలాభివృద్ధికి పాటుపడండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నందలూరు

మండల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభాభవనంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఓబులవారిపల్లె వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కులను అందించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, తహశీల్దార్ సత్యానందం, ఎంపిడిఒ సౌభాగ్యం, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి అద్దె చెల్లించలేదని బయటకు గెంటేశారు

-పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితురాలు ఆరోపణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటి అద్దె చెల్లించలేదని తనను బయటకు గెంటేసి, తన వస్తువులను దాచేశారంటూ బాధిత మహిళ లలితారెడ్డి ఆరోపించింది. శనివారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ గత పదేళ్లుగా తాను ప్రశాంత్‌నగర్‌లోని సుధాకర్‌రెడ్డి ఇంట్లో అద్దెకు వున్నానన్నారు. ఇంటి యజమాని సుదాకర్‌రెడ్డి కొందరు వ్యక్తులతో కలసి పోలీసుల సాయంతో తనను జూన్ 8వ తేది ఇంట్లోనుంచి గెంటేశారన్నారు. అనంతరం 10న రాత్రి ఎవరూలేని సమయంలో ఆ ఇంటిలో వున్న వస్తువులను లారీల సాయంతో తరలించి, ఎక్కడో దాచిపెట్టారు అన్నారు. అప్పటి నుంచి తన వస్తువులు ఎక్కడ వున్నాయని తెలపాలని పలుమార్లు కోరటంతో పాటు, పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోయిందన్నారు. కట్టుబట్టలతో తాను ఇంట్లో నుంచి వచ్చేశానని, తనకు చెందిన విలువైన వస్తువులు అక్కడే వుండిపోయాయన్నారు. ఇప్పటికైన తన వస్తువులను తనకు అప్పగించాలని లలితారెడ్డి కోరారు.


మాట్లాడుతున్న లలితారెడ్డి

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌టిఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పదివేల రూపాయల విలువచేసే విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.నరసారెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ రఘునాధరాజు పాల్గొని మాట్లాడారు. సంస్థ నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. భావిభారత పౌరులైన విద్యార్థులకు ఉచితంగా విద్యాసామదచీశీఅవగ్రిని అందజేయడం ప్రశంసనీయమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు పలుకూరు వెంకటరమణ మాట్లాడుతూ సామా జిక సేవా కార్యక్రమాలలో తమ సంస్థ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుం దని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామమూర్తి, మణి, ఆనంద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- యువకుడి మృతి, బాలుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా మరో బాలుడు తీవ్రంగా ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శనివారం సాయంత్రం పీలేరు-కలకడ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ఘటనా వివరాలిలా ఉన్నాయి. పీలేరు మండలం, బోడుమల్లువారిపల్లి పంచాయతీ, ఎల్లంపల్లికి చెందిన గంగాధర్ (25), దినేష్ కుమార్ (15) ఓ ద్విచక్ర వాహనంలో ఎల్లంపల్లి నుంచి సొరకాయల పేటకు బయలుదేరారని చెప్పారు. మార్గ మధ్యలోని దుర్గంవారిపల్లి సమీపంలో ఆవాహనాన్ని, గుర్తు తెలియని వాహనం ఢీకొందని అన్నారు. ఈ ఘటనలో గంగాధర్ అనే యువకుడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడని, తీవ్రంగా గాయపడిన దినేష్ కుమార్ ను పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించామన్నారు. ప్రథమ చికిత్స అనంతరం దినేష్‌కుమార్ ను మెరుగైన చికిత్స కోసం వైద్యులు తిరుపతికి పంపారని చెప్పారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


చికిత్స పొందుతున్న కుమార్